తండాకు మట్టి రోడ్డే దిక్కు

- వర్షాకాలంలో అవస్థలు పడుతున్న జిత్యాతండావాసులు
- బీటీ రోడ్డు వేయాలని వినతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలం హాజీపూర్‌తండా హామ్లెట్ గ్రామమైన జిత్యాతండాకు వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉండటంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. అడివిలింగాల గ్రామ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జిత్యాతండాకు సుమారుగా 2 కిలోమీటర్లు ఉంది. వర్షాలు కురిస్తే రోడ్డు బురదమయంగా మారడంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా అధికారులకు బీటీ రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని తండావాసులు వాపోతున్నారు. వర్షాకాలంలో తండాలో ఎవరైనా మృతి చెందితే శవాన్ని మోసుకుని పోయేందుకు నరకయాతన అనుభవిస్తున్నామని తండావాసులు చెబుతున్నారు. తండాకు బంధువుల రావాలంటే జంకుతున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.



జిత్యాతండా వెళ్లేందుకు ఉన్న మట్టి రోడ్డు

ఇబ్బందులు పడుతున్నాం



జిత్యాతండాకు చెందిన ప్రతి ఒక్కరూ ఏపని నిమిత్తమైనా బయటకు రావాల్సిందే. పింఛనుదారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తండాకు వెళ్లే రోడ్డును బీటీగా మార్చాలి.

– సీతారాం, జిత్యాతండా

తండాకు బీటీ రోడ్డు వేయాలి



తండాకు బీటీ రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డును నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– నరేశ్, జిత్యాతండా

ప్రతిపాదనలు పంపించాం

జిత్యాతండా వెళ్లేందుకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం పీఎం సడక్ యోజన పథకం కింద ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే తండాకు బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తాం.

– గిరిధర్, పంచాయతీరాజ్ డీఈ, ఎల్లారెడ్డి

నేటి చిత్రం



అధ్వానంగా భైరాపూర్–మల్లాపూర్ రోడ్డు

బాన్సువాడ : భైరాపూర్ – మల్లాపూర్ గ్రామాలకు మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రెండు గ్రామాల మీదుగానే భక్తులు తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్తారు. సుమారు కిలోమీటర్ మేర రోడ్డుపై మెటల్ వేసి వదిలేశారు. తారు వేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. –రాజు మల్లాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బాన్సువాడ : పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన గుంతలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గుంతల్లో మొరం వేసి పూడ్చి వేశామన్నారు. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గడుమల లింగం, మున్సిపల్ సిబ్బంది హన్మండ్లు, సతీష్ తదితరులున్నారు.

భిక్కనూరు ఠాణాలో పోలీసుల స్వచ్ఛభారత్



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంతో పాటు పరిసరాలను శనివారం పోలీసులు స్వచ్ఛభారత్ చేసి శుభ్రం చేశారు. సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను శుభ్రం చేసి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని, ప్రతినెల శనివారం ఈ కార్యక్రమం చేపడుతామన్నారు.

సదాశివనగర్ ఎస్సైకి సన్మానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీల నాయకులు, కుల సంఘాల పెద్దలు, యువజన సంఘాల సభ్యులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పుష్పరాజ్‌ను సన్మానించారు. మండల ప్రజలు సహకరించాలని ఎస్సై సూచించారు. ఉత్తునూర్ విండో చైర్మన్ ప్రభాకర్ రావు, మాజీ ఉప సర్పంచ్ వంకాయల రవి, వివిధ పార్టీల నాయకులు వెంకట్ రావు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఎస్సైగా భార్గవ్‌గౌడ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఎస్సైగా భార్గవగౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు నాగిరెడ్డిపేట ఎస్సైగా విధులు నిర్వహించిన మల్లారెడ్డి గత నెల30న పదవీ విరమణ పొందారు. హెడ్‌కానిస్టేబుల్ మనోహర్‌రావుకు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఉన్నతాధికారులు ఎస్సై భార్గవగౌడ్‌ను నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు అందజేత



విద్యార్థులకు నగదు అందిస్తున్న హెచ్‌ఎం

భిక్కనూరు : మండలంలోని కాచాపూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు రూ. 25వేలచొప్పున నగదు బహుమతిని పాఠశాల హెచ్‌ఎం రాంచందర్‌రావు శనివారం అందజేశారు. పదో తరగతిలో పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన రుషివర్ధన్‌కు, ద్వితీయ ర్యాంక్ సాధించిన చెన్నుగారి లక్ష్మణ్‌లకు పాఠశాల హెచ్‌ఎం రాంచందర్‌రావు కుమారుడు కృష్ణచైతన్యతో పాటు ఆయన మిత్రుడు సాత్విక్‌రెడ్డిలు ఒక్కొక్కరికి రూ.25వేల నగదు బహుమతిని అందజేశారు. గతంలో కూడా నిరుపేదలైన పాఠశాలకు చెందిన ఇద్దరూ విద్యార్థులకు వీరు ప్రతి నెల రూ. 500 చొప్పున అందించారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంటలుసాగు చేసే రైతులతోపాటు ఇతర వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి సూచించారు. నాగిరెడ్డిపేట మండలం బంజార విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దనున్న సెక్షన్ కార్యాలయంలో శనివారం ట్రాన్స్‌కో సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌కో సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. బకాయి విద్యుత్ బిల్లులను వసూలు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రప్రసాద్, ఏఈ నాగరాజు, ట్రాన్స్‌కో లైన్‌ఇన్స్‌పెక్టర్లు సురేందర్, నూర్యా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



బాన్సువాడ రూరల్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను ఆరోగ్య కార్యకర్తలు చైతన్య పర్చాలని కామారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. శనివారం ఆమె సబ్ యూనిట్ ఆఫీసర్ దయానంద్‌తో కలిసి కొయ్యగుట్టలో కొనసాగుతున్న ఇమ్యూనైజేషన్‌ను పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీకాల విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పర్యవేక్షించాలన్నారు. ఏఎన్‌ఎం అనురాధ ఉన్నారు.

త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

మాచారెడ్డి/బీబీపేట/రాజంపేట/సదాశివనగర్/భిక్కనూరు/పిట్లం/నస్రుల్లాబాద్/లింగంపేట : పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసర, మహబూబ్ నగర్‌లోని రాజీవ్‌గాంధీ యునివర్సిటీ త్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. మాచారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది, లచ్చాపేట కు చెందిన ఏడుగురు, చుక్కాపూర్‌కు చెందిన నలుగురు, సోమారంపేటకు చెందిన నలుగురు, ఎల్లంపేటకు చెందిన ఒకరు, పాల్వంచ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు, ఫరీదుపేటకు చెందిన ఇద్దరు, భవానీపేటకు చెందిన ఒకరు, ఇసాయిపేటకు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాచారెడ్డి, పాల్వంచ ఎంఈవోలు దేవేందర్‌రావ్, రాంమనోహర్‌రావ్‌లు విద్యార్థులను అభినందించారు. బీబీపేట టీఎస్ఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వసంత, కీర్తన, ప్రణతి, రేణుక, అక్షయ, అలాగే మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీనిధి, వైష్ణవి, నిక్షిత, లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. రాజంపేట మండలం తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని మోటాటి లిఖిత త్రిపుల్ ఐటీ బాసరకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దొమ్మాటి భిక్షపతి తెలిపారు. సదాశివనగర్ మండల కేంద్రంతో పాటు కల్వరాల్, ఉత్తునూర్ ఉన్నత పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు బాసర త్రిపుల్ల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో యోసెఫ్, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డిలు తెలిపారు. భిక్కనూరుకు చెందిన బూర్ల రిషికేష్ అనే విద్యార్థి బాసర త్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్ యాదవ్‌లు తెలిపారు. పిట్లం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్ యాసిన్, నిహారిక, అలాగే చిన్నకొడప్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఉపాసి కీర్తి పాటిల్, బోయిని సాయి లక్ష్మి, చిల్లర్గి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బోండ్ల సంతోష్‌లు త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో దేవిసింగ్ తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆకుల హర్షిణి త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం దుర్గాబాయి తెలిపారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన తేజశ్విని, శ్రీవాణి, సంజన, మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన రాహుల్, నిక్షయ్ త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, సిబ్బంది అభినందించారు. వీరు ఆరేళ్ల పాటు ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు చేయనున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇప్పించండి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న సంజీవులు

బాన్సువాడ రూరల్: అటవీశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను శనివారం హన్మాజీపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగరిగారి సంజీవులు సెక్రటరియేట్‌లో కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ మండలంలో పలు గ్రామాల్లో పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా పట్టాలు ఇచ్చారని, బీఆర్ఎస్ హయాంలో కాలయాపన చేశారని గుర్తుచేశారు. అటవీశాఖ అధికారులు పంటలను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. రైతు కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీలకు నిధులు కేటాయించి కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరామని ఆయన చెప్పారు.

ఆలయానికి రూ. 51వేలు విరాళం



కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని పురాతన కోడూరి హనుమాన్ ఆలయం అభివృద్ధి కోసం కామారెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద అధ్యక్షుడు చిలువేరు మారుతి– శ్రీదేవిలు దంపతులు శనివారం రూ.51 వేలు అందజేశారు మారుతి కొడుకు అభినవ్ జన్మదినం సందర్భంగా తన ఆస్పత్రి తరపున ఈ విరాళం అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు జి. ఆంజనేయశర్మ, ఆలయ కమిటీ సభ్యుడు పి.నర్సింలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులపై తీర్మానం

పట్టణ పరిధిలోని భూకన్‌పల్లి శ్రీ వ్యాధిహారక ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ద్వారా రూ.50 లక్షలు మంజూరుకు కృషి చేసినందుకు సరంపల్లి మాజీ సర్పంచ్ మామిండ్ల అంజయ్యను ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం సన్మానించారు. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.అంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించి మంజూరైన రూ.50లక్షల తో చేపట్టే ఆలయ పనుల విషయమై వేద పండితులు జి.ఆంజనేయశర్మతో చర్చించి తీర్మానించారు. సరంపల్లి మాజీ సర్పంచ్ నిట్టు గంగాధర్‌రావు, నాగయ్య, కే.పెద్ద సాయిలు, రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మోటాట్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాల పున: ప్రారంభం

భిక్కనూరు: మండలంలోని మోటాట్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలను పున: ప్రారంభించడానికి ప్రభుత్వం ఆదేశాలను జారీచేసిందని ఎంఈవో రాజ్‌గంగారెడ్డి శనివారం తెలిపారు. 2012–2013 విద్యాసంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంతో పాఠశాలను మూసి వేశామని తెలిపారు. గ్రామంలో 28 మంది విద్యార్థులు ఇతర గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్తున్నారని వీరి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపించేందుకు ఒప్పించినట్లు ఎంఈవో వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



కేటీఆర్‌తో జెడ్పీ మాజీ చైర్మన్లు

నిజాంసాగర్(జుక్కల్) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబోద్దీన్, జెడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్‌రాజు, దాదన్నగారి విఠల్ రావులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ ఎన్నికలతో పాటు మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగుర వేయాలని కేటీఆర్ సూచించినట్లు జెడ్పీ మాజీ చైర్మన్లు తెలిపారు.

స్నేహితురాలి కుటుంబానికి అండ



రాజంపేట : స్నేహితురాలి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. తలమడ్ల పాఠశాలలో 2000–01 పదోతరగతి చదువుకున్న విద్యార్థులు తమస్నేహితురాలు రమణబాయికి అరెపల్లిలో శనివారం రూ. 35 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రమణబాయి భర్త వివాహం జరిగిన కొన్ని సంవత్సరాలకు మరణించడంతో కుటుంబపోషణ భారమైంది. ఈ సందర్భంగా సహాయం అందించిన స్నేహితులకు రమణబాయి కృతజ్ఞతలు తెలిపారు.

బోర్లంలో టీబీ ముక్త్ భారత్



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంలో శనివారం టీబీ (క్షయ)ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలం పొడి దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయరాదని, ఆస్పత్రిలో తేమడ పరీక్ష చేయించుకోవాలని ఆరోగ్య కార్యకర్త యశోద రాజు అన్నారు. క్షయవ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తేబాన్సువాడ తీసుకెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. జీపీ కార్యదర్శి సాయి కుమార్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతికి రూ. 10 వేలు, 2వ బహుమతికి రూ. 6 వేలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు తలారి ఉదయ్ కిరణ్, శేరిపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ దేవయ్య, బీజేపీ గ్రామ అధ్యక్షుడు స్వామి, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్, రాజు, కిరణ్, సంతోష్, పర్శారాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ఎల్లారెడ్డిరూరల్: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని అడివిలింగాల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ చేశారు. జీపీ కార్యదర్శి శంకరయ్య తదితరులున్నారు.

పాఠశాలఆవరణలో మొరంపోయించిన 'పైడి'

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సైంటిస్ట్ పైడిఎల్లారెడ్డి మొరం పోయించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన దృష్టికి పాఠశాల ఆవరణ బురదమయంగా మారుతుందని తీసుకెళ్లారు. దీంతో పాఠశాల ఆవరణలో ఎల్లారెడ్డి 33 టిప్పర్ల మొరంను పోయించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బీబీపేట: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి రమేష్‌లు ఉన్నారు.

గడ్డి మందు పిచికారీ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని కేజీబీవీ, మహాత్మ జ్యోతిబాపూలే, ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో శనివారం గడ్డి మందు పిచికారీ చేయించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి బలరాం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున నేపథ్యంలో విషపురుగులు సంచరించే అవకాశం ఉందని గడ్డి మందు పిచికారి చేయించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఎరువుల కొరత లేకుండా చూడాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడ్వాయి శబరిమాత ఆశ్రమంలో శనివారం కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పొలాలకు వెళ్లే దారిలో రోడ్లు నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడు రాజేశ్వర్ రెడ్డి, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పండరి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పండరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు శనివారం తెలిపారు. పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, విఠల్, ప్రధాన కార్యదర్శిగా శేర్ల ప్రభువులు, కోశాధికారిగా ఆంజనేయులును ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోశెట్టి, పట్టణ అధ్యక్షులు రవి తదితరులున్నారు.

లింగాపూర్‌లో అంధకారం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని లింగాపూర్ 9వ వార్డులో 15 రోజులగా వీధి దీపాలు వెలగడంలేదు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలు కొన్ని చోట్ల కాలిపోగా కొత్త బిగించడంతో సమస్య తలెత్తింది. అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బోర్లంలో పీర్ల ఊరేగింపు



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో శనివారం పీర్ల పండుగ ఉత్సవాల్లో భాగంగా ఖాసీందూల పీర్లను గ్రామస్తులు బాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. భక్తులు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ ఇనాందార్లు, ఫకీర్లు, దూదేకుల కులస్తులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉద్యోగులకు క్యాన్సర్ వ్యాధిపై యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వైద్యుడు సందీప్ కుమార్ క్యాన్సర్ రాకుండా తీసుకునే జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, వ్యాధి లక్షణాలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఈలు ప్రభాకర్, కళ్యాణ్, చక్రవర్తి,ఎస్ఏవో రాజశేఖర్, యూనియన్ నాయకులు సంపత్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. భారత ప్రధానిగా మోదీ 11సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ రకాల మొక్కలను నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఎల్లారెడ్డిరూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నాయకులు అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని సామెల్ మాట్లాడారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి మండల కేంద్రంతో పాటు గ్రామాలలో సైతం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పద్మారావు, శివానందం, నరేష్, ఆగమయ్య తదితరులున్నారు.